


# జీవ నది

- సాయిబ్రహ్మానందం గొర్తి

మళ్ళీ నాకు హైదరాబాద్ ప్రయాణం పడింది. ఇంటికి ఫోన్ చేసి నా భార్య హరితతో చెప్పాను. నా ప్రయాణానికి బట్టలు సిద్ధంచేయమని రాత్రి ఫ్లైట్‌కి బయల్దేరాల్సి వస్తుంది. అదీ టిక్కటు కన్‌ఫరం అయితేనే ఈ ప్రయాణం ఉంటుంది. నా కొలీగ్ డాక్టర్ రాజన్ వాళ్ళ అల్లుడు ఎయిర్ పోర్ట్ డ్యూటీ ఆఫీసరు. టిక్కట్టు ఖచ్చితంగా దొరుకుతుందని రాజన్ హామీ ఇచ్చాడు. ఈలోగా నాకు మెడినోవా హాస్పటల్ నుండి వంద కాల్స్ వచ్చాయి. 'నేను బయల్దేరి వస్తున్నానా లేదా?' అని.

నేను రేపు ఉదయం మెడినోవాలో నేదునూరి రఘురాంకి బైపాస్ సర్జరీ చేయాల్సి ఉంది. నేదునూరి రఘురాం అంటే ప్రముఖ తెలుగు సినీ రచయిత. నేటి యువతరాన్ని ఉర్రూతలూగిస్తున్న మహాకవి! తెలుగు చిత్రాలకి పాటల దగ్గర్నుంచి, మాటలు, స్క్రీన్‌ప్లే వరకు అన్ని విభాగాల్లోనూ ఆయనకి విపరీతమైన పేరు ఉంది. అదీ కాకుండా తెలుగు చలన చిత్రసీమలో ఈ కవిగారి చేత మాటలు, పాటలు రాయిస్తే సినిమా ఖచ్చితంగా వంద రోజులాడుతుందన్న సెంటిమెంటు కూడా సినీ పరిశ్రమలో బలంగా నాటుకు పోయింది. ప్రస్తుతం ఈ కవిగారి హవా బాగానే ఉంది! ఈ మహాకవి రఘురాంగారితో పరిచయం నాకు నెల్లాళ్ళ క్రిందట హైద్రాబాదులో కార్డియాలజిస్టుల కాన్ఫరెన్సుకెళ్ళినప్పుడు నా స్నేహితుడు ఒకాయన, మెడినోవాలో డాక్టర్ ద్వారా ఆయన పరిచయం.

సినీ కవి రఘురాం రెగ్యులర్ చెకప్‌కని మెడినోవాకి వస్తే హార్ట్‌బీట్ తేడా ఉందని ఈసీజీలో బయట పడింది. డాక్టర్లకి అనుమానం వచ్చి మరిన్ని టెస్ట్‌లు చేస్తే రఘురాంకి ఎంత తొందర్లో బైపాస్ సర్జరీచేస్తే అంత మంచిదని డాక్టర్లు చెప్పారు. సరిగ్గా అదే సమయానికి నేను హైద్రాబాదు వెళ్ళడం, నా స్నేహితుడు నేనొక ప్రముఖ కార్డియాలజిస్టని రఘురాంకి పరిచయం చేయడం జరిగింది. నేనే ఇంతకుముందు మాజీ మంత్రి ఒకాయనకి బైపాస్ చేసానని, నా హస్తవాసి చాలా మంచిదని నా స్నేహితుడు రఘురాం కవిగారికి నా గురించి చెప్పాడు. అసలే సినిమావాళ్ళకి ఇలాంటి సెంటిమెంట్లు ఎక్కువని చదివాను. నా విషయం తెలిసాక రఘురాం నన్ను జలగలాగ పట్టుకున్నాడు. నేనే ఆయనకు బైపాస్ చెయ్యాలని పట్టుపట్టిమరీ హైద్రాబాదుకు రప్పించుకుంటున్నాడు. ముందుగా నేను ఈ సర్జరీ చేయడానికి తటపటాయించినా, నా స్నేహితుని బలవంతం మీద ఒప్పకున్నాను.

కానీ ఈలోగా ఓ చిన్న హార్ట్ ప్రోబ్లం వస్తే రఘురాం హాస్పటల్‌లో జాయిన్ అయ్యాడు. నా స్నేహితుడు బైపాస్ వెంటనే చేయాలని చెబితే ఉన్నట్లుండి ప్రయాణం కట్టాను.

హాస్పటల్‌లో త్వరగా పేషంట్లని చూడడం ముగించుకొని ప్రయాణానికి సిద్ధం అవుతుండగా, నా బాల్య స్నేహితుడు రాజు ఫోన్ చేసాడని, నన్ను తిరిగి ఫోన్ చెయ్యమన్నాడని హరిత చెప్పింది. రాజు నా మిత్రుడు మేమిద్దరం అమలాపురంలో పదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం.

ఎయిర్ పోర్ట్‌కొచ్చి చెకిన్ చేసాను. ఫ్లయిట్ గంట ఆలస్యంగా బయల్దేరుతుందని తెలిసింది. ఈలోగా హైద్రాబాదు ఫోన్‌చేసి విషయం చెప్పాను.

ఏం చెయ్యాలో తోచక పక్కనే ఉన్న స్టాల్లోకి అడుగుపెట్టాను ఏమైనా పుస్తకాలు కొందామని. ఇండియా టుడే కొత్త సంచిక వచ్చింది. అక్కడే తెలుగు ఇండియా టుడే కూడా నా కంట పడింది. నాకు తెలుగు పుస్తకాల మీద అభిమానంకొద్దీ అవే శీర్షికలు అయినా కొన్నాను.

ఏముందా అని తిరగేస్తుంటే "అపరిచితులు"అనే కథ నా దృష్టిలో పడింది.

రచయిత ఎవరా అని చూస్తే నాగరాజు భాష్యం అని ఉంది. నాగరాజంటే నా స్నేహితుడు రాజే. కథ వెనుక రచయిత పరిచయం చూసేక మా రాజు అనే తేలింది. నాకు చాలా సంతోషం అనిపించింది. కథ చదివాను. చాలా బాగా రాసాడు.

పరీక్ష తప్పితే ఆత్మహత్య చేసుకుందామనుకున్న ఒక అమ్మాయికి మరలా జీవితంమీద అవగాహన కలిగించే సంఘటన మీద రాసిన కథ. కథలో శిల్పం, శైలి నన్ను హత్తుకున్నాయి. రాజు ఓ మంచి రచయిత. తెలుగు భాష అన్నా, సాహిత్యం అన్నా చెవికోసుకుంటాడు. మేం పదో తరగతిలో ఉండగానే కంద పద్యాలు అవీ రాసేవాడు. మా తెలుగు మాస్టారి అభిమాన శిష్యుడు రాజు. నాకు పుస్తకాలు చదివే అలవాటు ఉండడంవల్ల మా స్నేహం మరింతగా పెరిగింది. నేను మెడిసన్ చదవడానికి వైజాగ్ వచ్చేసాను. రాజు మాత్రం భాషాప్రవీణ చేసి తెలుగు మాస్టారుగా అల్లవరంలో స్థిరపడిపోయాడు.

రాజు పేరు చూడగానే- ఉదయం ఫోన్ చేసాడని హరిత చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. వెంటనే సెల్‌ఫోన్ తీసి రాజుకి కాల్ చేసాను.

"రాజూ! నేనురా రవిని!"

"ఓ నువ్వా! ఉదయం ఫోన్ చేస్తే హరితగారు చెప్పారు. నువ్వు సెల్ ఇంట్లో మర్చిపోయి హాస్పటల్‌కి వెళ్ళావని! ఎలా వున్నావు?

"బాగానే ఉన్నా! ఒరేయ్- నీ అపరిచితులు కథ చదివాను. చాలా బాగుంది. చూసావా- నువ్వు తప్ప ఇంత బాగా ఎవరు రాయగలరు చెప్పు?" నవ్వుతూ అన్నాను.

"నీకు నేనంటే ఉన్న అభిమానం అటువంటిది. ఇండియా టుడేలో కథ వచ్చింది. చదువు అని చెప్పడానికే ఈ ఉదయం కాల్ చేసాను. అంతకు మించి ప్రత్యేకించి ఏమీలేదు.

"అభిమానం కాదు. నేనూ పుస్తకాలు చదువుతాను. నీలా కథలు రాసే వాళ్ళు చాలా తక్కువమంది ఉన్నారు. ఇదే నువ్వు ఏ ఇంగ్లీషులోనయినా రాస్తే నీకు మంచి ఆదరణ, కీర్తి లభించేది."

"నాలా రాసే వాళ్ళు అనేకమంది ఈ ఆంధ్ర దేశంలో ఉన్నారు. కేవలం బద్ధకమో లేక రాయాలన్న తపన లేకో రాయడం లేదంతే! నేను కూడా. దాదాపు ఇరవై ఏళ్ళ తరువాత మరలా రాయడం మొదలుపెట్టాను. అదీ నీ ప్రేరణవల్లే! ఇరవై ఏళ్ళ తరువాత మరలా నీ దర్శనంతో అంతా మారిపోయింది. నీతో మాట్లాడిన తరువాత నేనేం కోల్పోయానో తెలిసింది. మరలా సాహిత్య తీరాలు దర్శించడం నీవల్లే జరిగింది. ఒక రకంగా నా సాహిత్య పునఃప్రవేశానికి నాంది పలికింది నువ్వే. అందుకే ఇరవై ఏళ్ళ తరువాత మొదటి కథ అచ్చులో పడితే థాంక్స్ చెబుదామనే కాల్ చేసాను. థాంక్స్ ఫర్ యువర్ ఇన్స్పిరేషన్!"

"నాదేముంది! రాసింది నువ్వు! ఒక్కోసారి మన శక్తి మనకు తెలియదు. కష్టాలు, సమస్యలు, బంధాలు, బాధ్యతలు ఎక్కువై, సంసార వలయంలో చిక్కుకున్నప్పుడు, నిరాశలో మనం మనకున్న కొన్ని ప్రత్యేకమైన అభిరుచులు, ఇష్టాలు వదిలేసుకుంటాం! నీ విషయంలో ఇదే జరిగిందని నా అభిప్రాయం. అయినా నీలాంటి వాళ్ళ అవసరం సమాజానికి ఎంతో ఉంది."

"సమాజానికి నీలాంటి డాక్టర్ల సేవలు, అవసరం కానీ - నాలాంటి రచయితల అవసరం ఉందని అనుకోమంటావా?" ప్రశ్నించాడు రాజు.

"మా అవసరం ఆరోగ్యంవరకే- కానీ నీలాంటి వాళ్ళ రచనల ప్రభావం మనిషి మీద, ఈ సమాజం మీద చాలా ఉంటుంది."

"చదివితే కదా ప్రభావం ఉండేది. ఈ ఆంధ్ర దేశంలో సగానికి పైగా జనాలకి తెలుగు చదవడం రాదు. చదివినా నాలాంటి వాళ్ళ రచన్లు చదివే తీరికా, ఆసక్తి లేనే లేవు. అలాంటప్పుడు నాలాంటి వాళ్ళు రచనలు చేసినా చేయకపోయినా సమాజానికి అంత తేడా ఉండదు."

"ఇది నేనొప్పుకోను. రాస్తేనేకదా ప్రజలు చదివేది. రాయకుండా చదవలేదనుకోవడం అన్యాయం. నా దృష్టిలో తేడా కొంతైనా ఉంటుంది."

"అసలు ఈ ఆంధ్ర దేశంలో సినిమాలు తప్ప పుస్తకాలు చదివే అలవాటే పోయింది. ఒకవేళ చదివినా, సినిమా కబుర్లు లేదా విజ్ఞానం పేరుతో పెద్ద శీర్షికలు చదివేవాళ్ళే ఎక్కువ. సగంమందికి పైగా తెలుగు రాయలేరు. చదవలేరు. రాసే కొద్దిమందీ తప్పులు తడకలతో రాస్తున్నారు. ఈమధ్యనే ఒక పత్రికలో "సాహితీ వైద్యం"అని ఒక శీర్షిక చదివాను. చదివితే నవ్వొచ్చింది. నిజంగా తెలుగు సాహిత్యానికి జబ్బు చేసిందనిపించింది." ఈ మాటల్లో కొంత



ఇంటి వైద్యం ★ ప్రసారిణి పత్రములను తీసుకొని నువ్వుల నూనెలోవేసి తైలపాక విధిగా కాచి రెండు చంచాలు ఉదయం, సాయంత్రం తేనె మరియు మిరియాలు చూర్ణము కలిపి తీసుకుంటే నడుమునొప్పి తగ్గుతుంది.

బాధ, వేదన కనిపించాయి నాకు.

“సాహితీ వైద్యమా! బాగుందే- మనుషుల్లా సాహిత్యానిక్కూడా రోగాలు వస్తాయన్నమాట” నవ్వుతూ అన్నాను. అవతలివైపునుండి రాజు నవ్వు చిన్నగా వినిపించింది.

“సాహిత్యానికి అనారోగ్యం కాదు. మనకి- మన మనసులకి- మనసులలో పుట్టి ఊహల్లోంచి ఉద్భవించేదే కదా కవిత్వం! ఎప్పుడైతే మనకే అన్నీ తెలుసు అనుకోడం ప్రారంభించామో అప్పుడే మన పతనానికి మనమే మెట్లు కట్టుకుంటున్నామన్నమాట. ఆలోచనల్లకి ఏ రంగు పులిమితే ఆ రంగులోనే మన భావాలూ బయటకొస్తాయి. నేటి తెలుగు భాషకి లభిస్తున్న ఆదరణ చూస్తే బాధ కలుగుతుంది రవీ!”

“నీలాంటి కళాకారులు బాధపడాలి రాజూ! బాధలోంచే అమృతం పుట్టచ్చు. గొప్ప సాహిత్యం రావచ్చు. ఆరోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!”

“ఒరేయ్! రవీ చెప్పడం మర్చిపోయా- మన పక్కింట్లో ఉండే డాన్స్ మాస్టారు- అదేరా తెలుగు మాస్టారి భార్య పోయిందిరా!”

అమలాపురంలో మా పక్కింట్లో తెలుగు మాస్టారు ఉండేవారు. ఆయనకి కూచిపూడి నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉండేది.

“అయ్యో పాపం! నీకు గుర్తుందా డాన్స్ మాస్టారి కథ రాస్తాను అనేవాడివి. రాసావా?”

“లేదురా! నే పోయేలోగా ఆయన కథ ఎప్పటికైనా ఒక నవలగా రాయాలన్నదే నా కోరిక. నా దృష్టిలో అది కథ కాదు- జీవిత పరిణామాల మధ్య అంతర్లీనంగా ప్రవహించే ఓ ఆత్మకథ! నిన్నంతా ఆయనే గుర్తుకొచ్చారు. బాధేసింది” రాజు కంఠం మారింది.

మా తెలుగు మాస్టారు చనిపోయి దాదాపు ఏడేళ్ళు దాటింది. ఆయన భార్య కూడా చనిపోయిందన్న విషయం తెలిసి బాధ కల్గింది.

ఈలోగా చెకిన్ అనౌన్స్‌మెంట్ చేయడంతో రాజుకి బై చెప్పి చెకిన్ ద్వారం వైపు నడిచాను.

* * *

నేదునూరి రఘురాం బైపాస్ సర్జరీ విజయవంతంగా అయ్యింది. రఘురాంకి స్పృహవచ్చాక కృతజ్ఞతా పూర్వకంగా నావైపు చూసాడు. ఆయన కళ్ళనుండి కన్నీళ్ళు కారడం గమనించాను. నా చేతులు పట్టుకున్నాడు. నాకివన్నీ అలవాటే! అంతగా కంగారు పడవలసిందేమీ లేదని నేను హైదరాబాదులో ఇంకో నాలుగు రోజులు ఉంటానని చెప్పాను. నా మాటలు విని ఆయనకి కాస్త ధైర్యం వచ్చినట్లనిపించింది. నా స్నేహితుడు ఆపరేషన్ సక్సస్ అయ్యాక కవి రఘురాం ఎదుట నన్ను పొగడడం మొదలుపెట్టాను. నాకిలాంటివి అంతగా నచ్చవు. నా వృత్తి ధర్మమే నేను నిర్వర్తించానంతే అనిపిస్తుంది.

రెండురోజులు తర్వాత కవి రఘురాం బాగా కోలుకొన్నాడు. ఆయన్ని పరామర్శించడానికి చాలామంది సినిమా వాళ్ళు క్యూ కట్టారు. రఘురాంకి ముందుగానే హెచ్చరించాను. ఆయనకి రెస్టుబాగా కావాలనీ, ఇక ఈ విజిటర్స్‌ని కాస్త అడ్డుకోమనీ, ఆయన సెక్రటరీకి చెప్పాను. మూడో రోజునుండి రఘురాం మాట్లాడడం మొదలుపెట్టాడు. ఇక నా ప్రయాణం దగ్గరపడుతోందని, రేపు రాత్రి ఫ్లయిట్‌కి నేను ఢిల్లీ వెళుతున్నానని చెప్పాను.

నేను వెళుతున్నానని చెప్పగానే-

“నాకోసం ప్రత్యేకంగా ఢిల్లీనుండి వచ్చి ఈ ఆపరేషన్ చేసినందుకు నేను మీకు ఎంతో రుణపడి ఉంటాను. మీకు ఎప్పుడు ఏం సహాయం కావాలన్నా అడగండి. తప్పకుండా చేస్తాను.”

ఇక మాట్లాడవద్దన్నట్లు సంజ్ఞచేసాను. పక్కనే ఉన్న కవి రఘురాం సెక్రటరీ.

“చూసారు కదా! మా సార్ ఇమేజ్! మొత్తం సినీ పరిశ్రమ అంతా కదలి వచ్చింది. మా కవిగారంటే మాటలా? ప్రస్తుతం ఈ ఏడాది అయిదు సూపర్ హిట్ సినిమాలు ఈయన రాసినవే!” పొగడ్తల పుస్తకం తీసాడు.

వస్తానని చెబుతూ బయటకు వస్తూండగా ఎందుకో నాకు రాజు గుర్తుకొచ్చాడు.

రాజు కూడా మంచి రచయితే- కానీ రఘురాంగారికున్న ప్రజాదరణ మామూలు రచయితలకి లేదు. కేవలం ఆయన సినిమాలకే పరిమితం. రాజు లాంటి వాళ్ళు తెలుగు సినిమా పరిశ్రమకి వస్తే- ఎంతో పేరు గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

ఈ ఆలోచన తట్టగానే వెనక్కి వెళ్ళాను.

నేను మరలా వెనక్కి తిరిగి రావడం చూసి నేనేమయినా మర్చిపోయానా అన్నట్లుగా చూసారు కవి రఘురాం, ఆయన సెక్రటరీ.

నా స్నేహితుడు రాజు గురించి అతని రచనల గురించి వివరంగా చెప్పాను.



“అంతగా ఆలోచన దేనికి? నువ్వు కథలు, మాటలు అందిస్తావు. కాని తెర మీద నేదునూరి రఘురాంగారి పేరుంటుంది. నువ్వు పాటలు రాస్తే- రఘురాంగారి పేరుమీదుగా రాగాలు అల్లుకుంటుంది... నీకు మాత్రం చేసిన పని బట్టి ప్రతీ పనికి డబ్బు ముట్టచెబుతారు”

* * *

నేను అనుకున్నట్లుగా ఢిల్లీ వెళ్ళలేదు. నా ప్రయాణం కాన్సిల్ చేసుకున్నాను.

రాజు ఈ సాయంత్రం హైదరాబాదు వస్తున్నాడు.

ఓ అరుదైన అవకాశం అతనిముందు వాలిందన్న కబురు పంపాను.

సాయంత్రం కారు తీసుకొని రైల్వేస్టేషన్‌కి వెళ్ళి రాజుని రిసీవ్ చేసుకున్నాను.


నన్ను చూడగానే ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు రాజు. కారులో హోటల్కి వస్తూండగా నేను విషయం చెప్పడం మొదలుపెట్టాను.


“రాజూ! నాకు ప్రముఖ సినీ కవి నేదునూరి రఘురాం బాగా తెలుసు. వారంక్రితం నేనాయనకి బైపాస్ సర్జరీ కోసం హైద్రాబాదు వచ్చాను. నీ గురించి నాకు పూర్తిగా తెలుసు. డబ్బు లేక ఎన్ని కష్టాలు పడ్డావో, మీ నాన్నగారు పోయాక చెల్లెళ్ళ పెళ్ళి బాధ్యతలే కాదు, నీ తమ్ముళ్ళని మంచి ప్రయోజకులుగా చేయడంలో నువ్వెంత అలసిపోయావో తెలుసు. మీ పెద్దమ్మాయికి మెడిసన్ సీటు వచ్చినా ఆర్థిక ఇబ్బందులవల్ల చదివించలేనంటే, మీ పెద్దమ్మాయి ఆత్మహత్యా ప్రయత్నం గురించీ నాకు తెలుసు. అంతేకాదు- బాధ్యతలు, బంధాలమధ్య నువ్వెంత నలిగిపోయావో అంతా తెలుసు. నేదునూరి రాజారాం పేరున్న రచయిత. నువ్వు ఆయన దగ్గర అసిస్టెంట్‌గా పనిచేయాలి. అసిస్టెంట్ అంటే ఆయన పని చేసే సినిమాలకి మాటలు రాయడం, సీన్లురాయడం వగైరా... పనులుంటాయి. కానీ- ఆయనకి కొన్ని నియమాలున్నాయి. నువ్వు ఆయనతో కాంట్రాక్ట్ సైన్ చెయ్యాలి. ఇంకెవ్వరి దగ్గరా పనిచేయనని...”

కాంట్రాక్ట్ అనగానే రాజు మధ్యలో అడ్డుకున్నారు.

“అంటే... ఈ కాంట్రాక్ట్ ఎన్నేళ్ళు?”

“ఆయనకి సినిమాలు రెండుచేతులా ఉన్నంతవరకూ! ఆయన ఈ సినిమా పరిశ్రమ వదులుతాడని నేననుకోను. అంటే జీవితాంతం అన్నమాట...” (మిగతా 27వ పేజీలో)






ఇంటి వైద్యం
★ మహారాస్నాదిక్వాథము 30మి.లీ. రోజుకు మూడుసార్లు సేవిస్తే తుంటి నొప్పి తగ్గుతుంది.

(19వ పేజీ తరువాయి)

"జీవితాంతమా? అయినా ఈ కాంట్రాక్ట్‌లేమిటి... మనిషి మీద నమ్మకం ఉండాలి కాని."

"ఈ తెలుగు సినిమా పరిశ్రమ ఇంతే! నువ్వు ఎవరికైనా కథ చెప్పావనుకో... బాగుంటే నీకు తెలియకుండా షూటింగ్ కూడా పూర్తిచేసేస్తారు. ఇక్కడ ఇలాటివి సర్వసాధారణం. అందుకే సినిమా రిలీజు అయ్యేవరకూ అంతా సీక్రెట్‌గానే ఉంటుంది. వ్యవహారం అయినా నువ్వు కాంట్రాక్ట్ రాయడానికి నీకున్న అభ్యంతరం ఏమిటి?"

నే సూటిగా అడిగేసరికి ఏంచెప్పాలో తల దించుకున్నాడు రాజు.

"అభ్యంతరం అంటూ ఏమీలేదు. అయినా ఒక రచయితని ఇలా కాంట్రాక్ట్‌లో కట్టేయడమన్న ఆలోచనే జీర్ణించుకోలేకపోతున్నాను. ఇందులో నా పనికి దీనికీ ఉన్న లింకు, దాని పరిణామాలు ఏమిటా అన్నదే ఆలోచన..."

"అంతగా ఆలోచన దేనికి? నువ్వు కథలు, మాటలు అందిస్తావు. కాని తెరమీద నేదునూరి రఘురాంగారి పేరుంటుంది. నువ్వు పాటలు రాస్తే- రఘురాంగారి పేరుమీదుగా రాగాలు అల్లుకుంటుంది... నీకు మాత్రం చేసిన పని బట్టి ప్రతీ పనికి డబ్బు ముట్టచెబుతారు" వివరాలు చెప్పాను.

"అంటే- నా పేరు ఎక్కడా ఉండదా? నే రాయడమేమిటి- ఇంకోరి పేరు మీద ప్రజలకు అందించడమేమిటి? ఇలాచేస్తే రచయితగా నన్ను నేను చంపుకున్నట్లే కదా?"

"చంపుకోవడం ఎలా అవుతుంది? ఇంకొకరికి రాసిస్తున్నావంతే- నాకు తెలిసి చాలా మంది పేరున్న రచయితలు ఇలాగే పనిచేస్తాను. అంతెందుకు- అంతర్జాతీయంగా తన కథకి పేరొచ్చిన ఓ ప్రముఖ రచయిత ఇంకో ప్రముఖ దర్శక శిఖామణి గారికి ఘోస్ట్ రైటర్! అయినా- నువ్వు కథలు రాస్తే పారితోషికం తీసుకోవడం లేదూ? అదీ ఇలాంటిదే అనుకో!" సర్దుకోలుగా చెప్పాను.

రాజు ఈ కాంట్రాక్ట్ ఎక్కడ తిరస్కరిస్తాడోనని నా భయం.

"రవీ! ఎందుకో నాకు భయంగా ఉందిరా! రాయడం మానేసి మరలా మొదలుపెడితే ఇలా ఘోస్ట్ రైటర్‌గా మిగులుతున్నానా అనిపిస్తోంది..."

"నాకు తెలుసు రోజూ- నీ సంశయాలు! అయినా తప్పదు నీ అవసరాలు అటువంటివి. ఈ కాంట్రాక్ట్ చెయ్యడంవల్ల మీ అమ్మాయి మెడిసన్ చదివే అవకాశం ఉంది. మీ అబ్బాయిలిద్దరూ మంచి చదువు చదివే సావకాశం ఉంది. వదులుకోకు ఎవర్నీ నేను సహాయం అర్థించను. నీ కోసం నోరు విడిచి అడిగాను. పాపం రఘురాంగారు కూడా సరే నన్నాను."

రాజు సెంటిమెంట్‌పై చిన్నగా తట్టాను. నాకేసి బాధగా చూసాడు.

"కాదనకు రాజూ... ఇదొక మహత్తర అవకాశం! మరలా మరలా రాదు. రచయితగా విలువలు, ఆత్మాభిమానాలు పక్కనబెట్టు. నా మాట కాదనకు!" ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాను.

రాజు నా చేతిమీద చేయి వేసాడు సరేనన్నట్లుగా!

⁂

తరువాత నాకు హైదరాబాదు వెళ్ళే అవకాశమే రాలేదు. రాజు అల్లవరం నుండి హైదరాబాదు మకాం మార్చేసాడు. మేమిద్దరం తరచు ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్ళం. మొదట్లో సినిమా సంస్కృతి అర్థంకాకపోయినా నెమ్మనెమ్మదిగా లోతులు తెలిసాయి రాజుకి.

"ఎవరెలా ఉన్నా నీకనవసరం నీ పని నువ్వు చేసుకుపో! ఆఫీసుకెళుతున్నట్లే అనుకో" అని చెప్పాను.

రాజుని కలవడం ఈమధ్య కాలంలో కుదర్లేదు. నేను లండన్ వెళ్ళాను ఓ ఆర్నెల్లు రాజు కూడా తెరవెనుక బిజీ అయ్యాడు. మామధ్య మాటలు తగ్గాయి. లండన్‌నుంచి వచ్చాక ఊపిరి సలపనంత పని ఉండేది. కొత్తగా కేంబ్రిడ్జి యూనివర్శిటీలో నేను విజిటింగ్ ప్రొఫ్ సర్‌గా నన్ను ఎన్నుకోబడ్డాక కాస్త పని పెరిగింది.

ఓరోజు నేను హాస్పటల్‌కి వెళ్ళినప్పుడు నాకు మా కొలీగ్ ఒకాయన నా దగ్గరకొచ్చి- "డాక్టర్ రవీ ప్రస్తుతం ఢిల్లీలో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతోంది. నాదగ్గర మూడు టిక్కెట్లున్నాయి. నాకు ఒక సర్జరీ ఉంది. మీకు కుదిరితే వెళ్ళండి" అంటూ టిక్కట్లు చేతిలో పెట్టాడు.

హరితకి ఫోన్ చేస్తే వెళదాం. పని త్వరగా ముగించుకొని వెంటనే రమ్మనమంది. ఆ సాయంత్రమే. ఆఖరి రోజని వెళ్ళేక తెలిసింది. ఏం సినిమాలు ఉన్నాయా అని లిస్ట్ చూస్తే, అందులో 'జీవ నది' అనే తెలుగు సినిమా కూడా ఉంది.

"బైద్వా జాం, బెద్వా జాం" అంటూ ద్వంద్వార్థలనుండి బయటపడి ఈ అంతర్జాతీయ సినిమావైపు మన తెలుగు సినిమా ఎప్పుడు ప్రవేశించిందా అనిపించింది. మే వెళ్ళేసరికి ఆలస్యం అయ్యింది. గబగబా హాల్లో దూరాం. అప్పటికే టైటిల్స్ అయిపోయాయి. సినిమా మొదలయ్యింది.

వేగం పెరిగిన జీవితాల మధ్య ఇమడలేక, వంశపారంపర్యంగా వచ్చిన నాట్యాన్ని వదులుకోలేక, గుర్తింపులేని కళాకారుడి జీవితగాథే ఈ జీవ నది. ఈ కథ చూస్తే నాకూ, మా రాజుకీ తెలిసిన మా పక్కింట్లో నాట్యం నేర్పే తెలుగు మాస్టారు గుర్తొచ్చారు. రాజు ఆయన జీవితచరిత్ర నవలగా రాస్తానని అనేవాడు.

కొంపతీసి ఈ కథ నేదునూరి రఘురాం గారికి ఇచ్చేసాడా? గబగబా బయటకొచ్చి సినిమా పోస్టర్ చూసాను. అనుకున్నంతా అయ్యింది. కథ, స్క్రీన్‌ప్లేదగ్గర నేదునూరి రఘురాం అన్న నల్లటి అక్షరాల అడుగున రాజు పేరు భూస్థాపితం అయినట్లనిపించింది నాకు.

జీవనది సినిమాకి అంతర్జాతీయ అవార్డ్ వచ్చిందని అప్పుడే తెలిసింది. నా మనసెందుకో రోదించింది. ఈ అవార్డ్ నిజానికి మా రాజుకి దక్కాల్సింది. రాజు సెల్‌కి కాల్‌చేస్తే మెసేజ్‌కి వెళ్ళిపోతోంది.

ఇంటికి బయల్దేరి వస్తూండగా హరిత అంది.


"ఈ సినిమా చూస్తే మీ ఊళ్ళో మీ పక్కింటి తెలుగు మాస్టారి కథలా అనిపించింది నాకు. ఈ సినిమాకి నేదునూరి రఘురాంకి అవార్డ్ ఇచ్చారు. మీ ఫ్రెండ్ ఆయన దగ్గర పని చేస్తున్నాడని చెప్పారుకదా. బహుశా రాజుగారే ఈ కథ ఆయనకి అమ్మేసి ఉంటారు. అసలు ఈ అవార్డు మీ ఫ్రెండ్ రాజుకి దక్కాల్సింది. ఆత్మాభిమానం చంపుకొని, ఆయన ఈ కథ ఇంకోరి పేరుమీద ప్రపంచానికి అందేలాచేసి ఆయనలోంచి రచయితని చంపేసారు మీ ఫ్రెండ్ రాజు. ఈ పని చేసినందుకు ఆయన సిగ్గుపడాలి."


హరితకి తెలుసు. మా పక్కింటి తెలుగు మాస్టారి కథ. గతంలో నేనే చెప్పాను.

మాటలు ముల్లుల్లా గుచ్చుకున్నాయి మనసుకి.

"రాజులో రచయితని చంపింది నేనే హరితా! సిగ్గు పడాల్సింది వాడు కాదు, నేను!"

మనసు మౌనంగా రోదించింది. ★




ఇంటి వైద్యం

★ వాత గజాంకుశరస్/ మహావాత విధ్వంసినిరస్ ఒక మాత్ర చొప్పున రోజుకు మూడుసార్లు సేవిస్తే కీళ్లనొప్పులు తగ్గుతాయి.